సాక్షి నిర్మల్

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025

గరిష్ఠం/కనిష్ఠం
27.5/24.5

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తగ్గుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బురదలో దిగి.. పంటలను పరిశీలించి..



నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో దెబ్బతిన్న పంటలను బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. తిర్పెల్లి గ్రామంలోని వాగు బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జి పైభాగం కొట్టుకుపోవడంతో మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చామన్‌పల్లి, చింతల్‌చాంద, మునిపల్లి, పీచర, ధర్మారం, పార్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. వర్షాలతోపాటు ఉప్పొంగిన గోదావరి ప్రవాహానికి దెబ్బతిన్న పంటలను బురదలో దిగి పరిశీలించారు. నష్టం వివరాలు నమోదు చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆయన వెంట రావుల రాంనాథ్, భూపాల్‌రెడ్డి, చిన్నయ్య, ముత్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేశ్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, రాజేశ్వర్, రాజారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారు.

వినాయకుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



గణనాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రజలందరిపై వినాయకుని ఆశీస్సులు ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకునికి మంగళవారం నిమజ్జన పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం విగ్రహదాత, వేలంలో లడ్డూ గెలుచుకున్న వారిని కలెక్టర్ సత్కరించారు. పూజా కార్యక్రమం అనంతరం ఉద్యోగులు, సిబ్బంది వినాయకుని శోభాయాత్రను నిర్వహించారు. భక్తిగీతాలకు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి, వినాయకసాగర్ (బంగల్ పేట్) చెరువులో గణనాథుని నిమజ్జనం చేశారు.

పంటలను పరిశీలించిన సబ్ కలెక్టర్



గోదావరి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

బాసర: భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ మంగళవారం శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన భవనంలో సాధారణ భక్తుడిగా భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం, తహసీల్దార్ పవన్ చంద్రతో కలిసి గోదావరి ఉధృతికి మునిగిన ప్రాంతాలను, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. గోదావరి బ్రిడ్జి పైనుంచి ప్రవాహాన్ని పరిశీలించారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి గణపతి నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఫోకస్ లైట్లు, విద్యుత్ అలంకరణ, గజ ఈతగాళ్లు, బోటింగ్ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు పంట నష్టపోయిన రైతులు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని తహసీల్దార్ పవన్‌చంద్రకు వినతిపత్రం ఇచ్చారు. దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయించాలని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఘనత కాంగ్రెస్‌దే



మాట్లాడుతున్న రాంభూపాల్‌వర్మ

సారంగపూర్: ఇచ్చిన మాటకు కట్టుబడి రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల ఇన్‌చార్జి రాంభూపాల్‌వర్మ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, నాయకులు రాంశంకర్‌రెడ్డి, ఎంబడి రాకేశ్ పాల్గొన్నారు.

మార్పు వెనుక మతలబేంటి?

- ఐఏఎస్‌ను తప్పించి.. ఇన్‌చార్జిని తెచ్చారు!
- బాసర ఇన్‌చార్జి ఈవోగా అంజనాదేవి నియామకం
- రెండేళ్లుగా ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్న వైనం..
- తాజాగా స్పెషల్ ఆఫీసర్‌ను నియమించిన 42 గంటల్లో మార్పు
- ఆటలు సాగవనే చక్రం తిప్పారా?
- ఆలయ అభివృద్ధికి రాజకీయ గ్రహణం



బాసర జ్ఞానసరస్వతీ ఆలయం

భైంసా: తెలంగాణలోని ప్రసిద్ధ శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారి క్షేత్రమైన బాసర ఆలయంలో పాలనాపరమైన గందరగోళం రాజకీయ చర్చకు దారితీసింది. రెండేళ్లుగా ఆలయ ఈవో పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జి ఈవోతోనే నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్ ఆలయానికి ప్రత్యేక అధికారిగా భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ ఉత్తర్వులు జారీ అయిన 42 గంటల్లోనే దేవాదాయ శాఖ మరో ఉత్తర్వు జారీ చేసింది. ఇన్‌చార్జి ఈవో సుధాకర్‌రెడ్డి స్థానంలో అంజనాదేవిని మళ్లీ ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ నియమించింది. ప్రత్యేక అధికారి నియామకం ఉత్తర్వులు రద్దు చేసింది.

ప్రత్యేక అధికారి నియామకంపై వివాదం..

కలెక్టర్ ఉత్తర్వులు ఆలయ పాలనలో క్రమశిక్షణ, పారదర్శకత తీసుకొస్తాయని భక్తులు, స్థానికులు ఆశించారు. ఐఏఎస్ అధికారి స్థాయిలో ప్రత్యేక అధికారి నియామకం ఆలయ అభివృద్ధికి, ఉద్యోగుల క్రమశిక్షణకు దోహదపడుతుందని భావించారు. అయితే, దేవాదాయ శాఖ ఈ నియామకాన్ని కాదని, మళ్లీ ఇన్‌చార్జి ఈవోను నియమించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. స్పెషల్ ఆఫీసర్ ఉంటే ఆలయంలో తమ ఆటలు సాగవనే కొందరు ఉత్తతాధికారులపై ఒత్తిడి తెచ్చి 42 గంటల్లోనే స్పెషల్ ఆఫీసర్ నియామకం రద్దు చేయించినట్లు తెలుస్తోంది. తమ ప్రభావాన్ని కాపాడుకోవడానికి కొందరు ఉన్నతాధికారులు కూడా స్పెషల్ ఆఫీసర్ నియామకాన్ని అడ్డుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐఏఎస్ అధికారిపై ఆశలు..

ఐఏఎస్ ప్రత్యేక అధికారిగా నియమితులైతే ఆలయంలో క్రమశిక్షణ, అభివృద్ధి, పారదర్శకత మెరుగవుతాయని భక్తులు ఆశించారు. రానున్న పుష్కరాలు, బాసర మాస్టర్ ప్లాన్ అమలు, ఆలయ సౌకర్యాల మెరుగుదలలో సబ్ కలెక్టర్ కీలక పాత్ర పోషిస్తారని భావించారు. అయితే, కొంతమంది అధికారులు తమ ప్రయోజనాల కోసం ఈ నియామకాన్ని అడ్డుకున్నారని సమాచారం. మళ్లీ ఇన్‌చార్జి ఈవోను నియమించడం ద్వారా ఆలయ అభివృద్ధికి ఆటంకం కలిగించారని స్థానికులు భావిస్తున్నారు.

ఆలయ ప్రతిష్టకు మచ్చ..

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధమైన బాసర సరస్వతీ ఆలయం ప్రతిష్ట కొంతకాలంగా మసకబారుతోంది. రెండేళ్లుగా శాశ్వత ఈవో లేకుండా, ఇన్‌చార్జీ ఈవోలతోనే పరిపాలన సాగుతోంది. ఆలయంలో అక్షరాభ్యాసం, పూజా కార్యక్రమాల్లో నిబంధనల ఉల్లంఘన, టెండర్లలో అవినీతి ఆరోపణలు బయటకు వచ్చాయి. భక్తుల సౌకర్యాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. లడ్డూల పక్కదారి వంటి ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రత్యేక అధికారిని నియమించారు. అయితే అది నచ్చని దేవాదాయ శాఖ ఆ నిర్ణయాన్ని రద్దు చేయడంతో ఆలయ అభివృద్ధిపై ఆశలు నీళ్లు చల్లినట్లయింది.

ప్రభుత్వం దృష్టి పెడితేనే..

దశాబ్ద కాలంగా బాసర ఆలయంలో అవినీతి, పరిపాలనా లోపాలు, భక్తుల అసౌకర్యాలు కొనసాగుతున్నాయి. ఆలయ ఆదాయం తగ్గడం, భక్తుల సంఖ్య తగ్గడంతో స్థానిక వ్యాపారుల జీవనోపాధి కూడా దెబ్బతింటోంది. తెలంగాణలోని ఇతర ఆలయాలు శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా, బాసర ఆలయ అభివృద్ధిపై వివక్ష కొనసాగుతోంది. గత ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినా.. ప్రభుత్వం మారడంతో వెనక్కు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఐఏఎస్ స్థాయి అధికారిని శాశ్వతంగా నియమించి, అవినీతిని అరికట్టాలని, ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రజల గుండెల్లో వైఎస్సార్

ఖానాపూర్/భైంసాటౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రజల్లో చెరగని ముద్ర వేశారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, భైంసాలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంక్షేమ పథకాల ఆద్యుడు వైఎస్సార్ అని తెలిపారు. జలయజ్ఞం, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, తదితర పథకాలతో ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని వివరించారు. బాసరలో ట్రిపుల్ ఐటీ వైఎస్సార్ హయాంలోనే ఏర్పాటైందని తెలిపారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టును సైతం నిర్మించినట్లు గుర్తు చేశారు. బాసరలో గోదావరిపై 12 లిఫ్టులు నిర్మించారని తెలిపారు. కార్యక్రమాల్లో దయానంద్, భూషణ్, మాజిద్, నిమ్మల రమేశ్, చిన్నం సత్యం, అంకం రాజేందర్, మడిగెల గంగాధర్, గంగనర్సయ్య, మదిరె సత్యనారాయణ, రమేశ్, శేషాద్రి, సంతోష్, రాజునాయక్, శంకర్, గంగాధర్, శ్రీహరి, జహీర్, శంకర్ చంద్రే, ఆత్మ చైర్మన్ వివేకానంద, భోజరాం పాటిల్, బషీర్, బంక బాబు, సందీప్, నరేందర్‌రెడ్డి, ఆత్మారామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు, నాయకులు

ఫోన్ పోతే ఆందోళన వద్దు



బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, ఫోన్ పోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 65 ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ జానకీ షర్మిల జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో మంగళవారం అందజేసి మాట్లాడారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసి చెక్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు పోయిన 1,631 ఫోన్లను రికవరీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఉపేంద్రారెడ్డి, ఐటీ కోర్, వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వసతులకు ప్రాధాన్యం

- డీఈవో భోజన్న



నిర్మల్ రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారి(ఎఫ్ఏసీ)గా భోజన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్‌కు చెందిన ఆయన సొంత జిల్లాకు డీఈవోగా రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు, మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.

సాక్షి : సొంత జిల్లాలో పనిచేయడం ఎలా ఉంది?

డీఈవో : చాలా ఆనందంగా ఉంది. పుట్టి పెరిగి, చదువుకున్న జిల్లాలోనే డీఈవోగా పనిచేయడం బాధ్యతను మరింత పెంచింది. సమష్టి కృషితో జిల్లాను విద్యారంగంలో మొదటి స్థానంలో నిలపడానికి కృషి చేస్తాను.

సాక్షి : పదో తరగతి ఫలితాల మెరుగునకు ఏం చర్యలు తీసుకుంటారు?

డీఈవో : పదో తరగతి ఫలితాల్లో గతంలో రెండుసార్లు జిల్లా రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలిచింది. గతేడాది 15వ స్థానానికి పడిపోయింది. ఈసారి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల సహకారంతో జిల్లాను మరోసారి ఉన్నత స్థితిలో నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తాం. దాని ప్రకారం ముందుకెళ్తాం.

సాక్షి : ఎఫ్ఆర్ఎస్ 100 శాతం అమలు కావడం లేదు?

డీఈవో : పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) తప్పనిసరి. నిర్ణీత సమయానికి ఉపాధ్యాయులు హాజరై ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాలి. జిల్లాలో 55 శాతమే అమలవుతోంది. త్వరలోనే వంద శాతం అమలయ్యేలా చర్యలు తీసుకుంటా.

సాక్షి : విద్యాశాఖలో ఏ విధమైన మార్పులు తీసుకొస్తారు?

డీఈవో : ప్రభుత్వ బడుల్లో డిజిటల్ క్లాసులు, వ్యాయామ విద్య, కోకరికులం యాక్టివిటీలు సజావుగా జరిగేలా చూస్తాను. కలెక్టర్ ప్రవేశపెట్టిన 'బాలశక్తి' కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం.

సాక్షి : ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఆరోపణలు వచ్చాయి. మీరెలా అధిగమిస్తారు?

డీఈవో : పూర్తి నివేదిక తీసుకుని పొరపాటుకు కారణమైన బాధ్యులపై చర్య తీసుకుంటాం. ఈనెల 4లోపు ప్రమోషన్ల ద్వారా ఖాళీ అయిన స్థానాల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తి చేస్తాం. ఉపాధ్యాయ సంఘాలు కూడా సహకరించాలి.

సాక్షి : గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డీఈవో : జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి. గుర్తింపు లేని పాఠశాలలను త్వరలోనే గుర్తించి వాటిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు జారీ చేస్తాం.

తొలి రోజే.. చదువుకున్న బడికి..



మాట్లాడుతున్న డీఈవో భోజన్న

నిర్మల్ రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే భోజన్న తాను ఓనమాలు నేర్చుకున్న మంజులాపూర్ పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో ఆయన ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివారు. డీఈవోగా చార్జి తీసుకున్న అనంతరం నేరుగా పాఠశాలకు వెళ్లి తన బాల్య స్మృతులను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ 'తాను ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు ఇదే పాఠశాలలో చదువుకుని డీఈవోగా ఎదిగాను' అని తెలిపారు. చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో వసతులు, సౌకర్యాలు, సమస్యల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన డీఈవో త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం హెచ్ఎం సిద్ధ పద్మ, ఉపాధ్యాయులు డీఈవోను సత్కరించారు.

పల్లెల్లో 'స్థానిక' సందడి

- పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితా ప్రకటన
- జోరందుకున్న ఎన్నికల సందడి
- సమరానికి సిద్ధమవుతున్న ఆశావహులు
- 10న పరిషత్ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



ఓటరు తుది జాబితా విడుదల చేస్తున్న అధికారులు

పంచాయతీ డివిజన్లు	02
మొత్తం మండలాలు	18
గ్రామపంచాయతీలు	400
వార్డులు	33,68
మొత్తం ఓటర్లు	4,49,302
పురుషులు	2,13,805
మహిళలు	2,35,485
ఇతరులు	12

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. ఇటీవలి వరకు గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలపై స్పష్టత లేకపోవడంతో ఆశావహుల్లో సందిగ్ధం నెలకొంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాయడంతో గ్రామీణ రాజకీయ వాతావరణం వేడెక్కింది. మంగళవారం గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా విడుదలైంది. సెప్టెంబర్ 10న పరిషత్(ఎంపీటీసీ, జెడ్పీటీసీ) ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రకటించనున్నారు. అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమవుతుండగా, ఆశావహులు కూడా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు.

ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్..

గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది దాటింది. సాంకేతిక సమస్యల కారణంగా ఎన్నికల నిర్వహణ ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రకటించింది. గవర్నర్ ఆమోదం లేనప్పటికీ, అసెంబ్లీలో పంచాయతీరాజ్, పురపాలక చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందింది. ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాయడంతో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఆమోదం లభించింది.

ఓటర్ల జాబితా విడుదల..

మంగళవారం గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా విడుదలైంది. జిల్లా వ్యాప్తంగా 4,49,302 ఓటర్లు నమోదయ్యారు, వీరిలో 2,13,805 మంది పురుషులు, 2,35,485 మంది మహిళలు, 12 మంది ఇతరులు ఉన్నారు. సెప్టెంబర్ 6న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం, సెప్టెంబర్ 10న తుది జాబితా ప్రకటించనున్నారు. దీంతో ఎన్నికల ప్రక్రియలో తొలి దశ పూర్తవుతుంది.

రాజకీయ పార్టీల్లో కదలిక..

ఎన్నికల ఆలస్యం కారణంగా రాజకీయ నాయకులు ఇప్పటివరకు పెద్దగా దృష్టి సారించలేదు. అయితే, అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసింది. బీజేపీ సైతం అడపాదడపా సమావేశాలు నిర్వహించగా, బీఆర్ఎస్ ఎన్నికలపై పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎన్నికల ప్రకటన తెరపైకి రావడంతో పార్టీల్లో కదలిక మొదలైంది. కాంగ్రెస్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయం కోసం వ్యూహాలు రచిస్తోంది. బీజేపీ కూడా ఇప్పుడిప్పుడే ఎన్నికల సన్నాహాల్లో నిమగ్నమైంది.

నోటిఫికేషనే తరువాయి..

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి 19 నెలలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగిసి 13 నెలలు గడిచాయి. పరిపాలనా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పరిషత్‌కు కలెక్టర్, మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులు కొనసాగుతున్నారు. హైకోర్టు సెప్టెంబర్ 30 వరకు ఎన్నికలు నిర్వహించాలని గడువు విధించిన నేపథ్యంలో త్వరలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేయడంతో ఈ ఎన్నికల్లో బీసీ ప్రాతినిధ్యం గణనీయంగా పెరగనుంది. జిల్లాలో 18 మండలాల్లో 7 జెడ్పీటీసీ, 7 ఎంపీపీ, 190 ఎంపీటీసీ స్థానాల్లో 66 బీసీలకు దక్కే అవకాశం ఉంది, జెడ్పీ చైర్మన్‌తోసహా బీసీలకు ఎక్కువ ప్రాతినిధ్యం లభించనుంది.

గ్రామ పంచాయతీలు, వార్డులు, ఓటర్ల వివరాలు..

మండలం	జీపీలు	వార్డులు	ఓటర్లు
దస్తురాబాద్	13	102	12,894
కడెం	29	242	29,159
ఖానాపూర్	25	192	23,657
పెంబి	24	152	10,886
మామడ	27	222	26,072
లక్ష్మణచాంద	18	162	24,577
నిర్మల్ రూరల్	20	170	22,751
సారంగాపూర్	32	282	39,516
సోన్	14	132	21,801
దిలావర్‌పూర్	12	108	18,744
నర్సాపూర్(జి)	13	120	20,238
లోకేశ్వరం	25	224	29359
కుంటాల	15	134	19,055
భైంసా	30	258	33,970
ముధోల్	19	166	28,754
తానూర్	32	268	31,516
బాసర్	10	90	15,728
కుభీర్	42	344	40,625

ఎరువు కోసం తరలివచ్చి..



ఎరువుల కోసం సొసైటీ వద్ద నిరీక్షిస్తున్న రైతులు

ఖానాపూర్: వానాకాలం పంటలకు కావాల్సిన ఎరువుల కోసం రైతులు పాట్లు పడుతున్నారు. పీఏసీఎస్‌లతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. ఖానాపూర్ పీఏసీఎస్‌కు మంగళవారం 450 బస్తాల యూరియా వచ్చింది. సమాచారం తెలుసుకున్న రైతులు అక్కడకు తరలివచ్చారు. వర్షంలోనూ గంటల తరబడి నిరీక్షించారు. చివరకు ఒకరాకు ఒక బస్తా చొప్పున అందించారు.

కాళేశ్వరంపై దుష్ప్రచారం మానుకోవాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్‌టౌన్: కాళేశ్వరంపై కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం మానుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రామ్‌కిషన్‌రెడ్డి అన్నారు. అధిష్టానం పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామ్‌కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై కుట్రలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ వరప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి నదీ జలాలను ఆంధ్రాకు తరలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సీబీఐకి కాళేశ్వరం విచారణను అప్పగించడం ప్రాజెక్టును మూసేయడమని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక రేవంత్ సర్కార్ ఇలా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, భూషణ్‌రెడ్డి, డాక్టర్ సుభాష్‌రావు, గంద్రత్ రమేశ్, అక్రమ్ అలీ, నజీరుద్దీన్, మొహమ్మద్ నయీమ్, మహబూబ్, మసూద్ అలీఖాన్, జుబేర్ ఖాన్, మొహమ్మద్‌బిన్ అలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే కచ్చితత్వంతో పూర్తి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో డిజిటల్ జనరల్ క్రాఫ్ట్ ఎస్టిమేషన్ సర్వే కచ్చితత్వంతో పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వేపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతీ అధికారి పూర్తి అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. పొరపాట్లు లేని సర్వేతో దిగుబడి అంచనాలు పారదర్శకంగా ఉంటాయన్నారు. ప్రస్తుతం కొన్నిరాష్ట్రాల్లో మాత్రమే ఈ డిజిటల్ సర్వే అమలులో ఉందని, దీని ద్వారా కచ్చితమైన పంట దిగుబడి వివరాలు లభిస్తాయన్నారు. మొత్తం 68 పంటలపై ఈ సర్వే నిర్వహించాలని, రైతుల సమస్యలు తెలుసుకుని వారికి సరైన అంచనాలు అందించడం ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లా ప్రణాళిక అధికారి జీవరత్నం, వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిరాణా దుకాణంలో చోరీ

నర్సాపూర్ (జీ): మండల కేంద్రంలోని ఓ దుకాణంలో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మనుబోలు శ్రీనివాస్ లక్ష్మీనరసింహా రిటైల్ అండ్ హోల్‌సేల్ కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి కిరాణా దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి కనిపించాయి. లోనికి వెళ్లి చూసి రూ.60వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బ్యాంక్ స్కాంలో మరో 3 కిలోల బంగారం రికవరీ


నగల రికవరీ కోసం విచారణ చేస్తున్న సీఐ దేవేందర్‌రావు

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచ్‌లో జరిగిన భారీ కుంభకోణంలో 25.17 కిలోల బంగారు ఆభరణాలు అపహరణకు గురైన విషయం తెలిసిందే. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇప్పటికే 15.237 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. మిగతా బంగారాన్ని రికవరీ చేసేందుకు దర్యాప్తు చేస్తున్న పోలీసుల ప్రైవేట్ ఫైనాన్స్‌లపై దాడులు నిర్వహిస్తున్నారు. మంచిర్యాలలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో మరో మూడు కిలోలు, చెన్నూర్ ముత్తూట్ ఫైనాన్స్‌లో రెండు గ్రాముల బంగారు ఆభరణాలను చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు రికవరీ చేసినట్లు తెలిసింది.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీలో అక్రమంగా అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకుడు షేక్ అయ్యుబ్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. అతడి నుంచి రూ.3వేల విలువైన 2.700 ఎంఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమించిన బీఆర్ఎస్ నాయకులపై కేసు

బోథ్: రోడ్డుపై ర్యాలీ, ధర్నా నిర్వహించిన తొమ్మిది మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సొనాల గ్రామానికి చెందిన తుల శ్రీనివాస్, షేక్ ఆసిఫ్, తుల హరీశ్‌కుమార్, సుధీర్‌రెడ్డి, పుల్సింగ్ నాయక్‌తండాకు చెందిన రాథోడ్ ప్రదీప్, సకారం, చింతల్‌బోరి గ్రామానికి చెందిన ముండే ఈశ్వర్, పుల్సింగ్‌నాయక్‌తండాకు చెందిన అదే కిశోర్, గుర్రాలతండాకు చెందిన సోలంకి రుక్మాణ్‌సింగ్ మంగళవారం మండలంలోని సొనాల గ్రామంలోని బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ర్యాలీలకు అనుమతి లేదని పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రోడ్డుపై వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ ఘటనపై ఏఎస్సై రాథోడ్ ధర్మాసింగ్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

గుదిబండగా బదిలీ విధాన ఉత్తర్వులు


కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

- కొత్త నిబంధన మార్చాలని డిమాండ్
- తొమ్మిది నెలలుగా నిలిచిన బదిలీలు

శ్రీరాంపూర్: సింగరేణిలో జారీ అయిన నూతన బదిలీ విధాన ఉత్తర్వులు గుదిబండగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రిక్వెస్ట్ బదిలీ విధానాలను మార్చుతూ కంపెనీ మే నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లోని నిబంధనలతో కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ఉద్యోగులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోవాలంటే ప్రస్తుతం ఉన్న ఏరియాలో పూర్తి చేసి ఉండాలి. అప్పుడే అతని దరఖాస్తును స్వీకరిస్తారు. ఆ పిమ్మట అవకాశాన్ని బట్టి బదిలీ జరుగుతుంది. ఈ దరఖాస్తులను కూడా క్యాలెండర్ ఇయర్‌లో రెండుసార్లు మాత్రమే స్వీకరిస్తారు. ఏప్రిల్, అక్టోబర్‌లో మాత్రమే బదిలీ ప్రక్రియ చేపడతారు. తన సర్వీస్ కాలంలో ఓ ఉద్యోగి రెండుసార్లు మాత్రమే రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకునే వీలుంది. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఒకసారి రిక్వెస్ట్ బదిలీపై వచ్చిన తరువాత తిరిగి రిక్వెస్ట్ బదిలీ పెట్టుకోవాలంటే కనీసం మూడేళ్లు ఆ ఏరియాలో సర్వీస్ పూర్తి చేయాలి. ఇక ఫోకల్ పాయింట్‌లో ఉన్న వారికి నాలుగేళ్ల సర్వీస్ ఉండాలనే నిబంధన ఉంది.

మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు కూడా..

మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు కూడా కొత్త విధానాలు ఇబ్బందిగా మారాయి. వీరికి రిక్వెస్ట్ బదిలీలో ఉన్న ఉత్తర్వుల మాదిరిగా కూడా మూడేళ్లు చేసి ఉండాలి. బదిలీపై వెళ్లాలనుకున్న ఏరియాలో ఇదివరకు 10 ఏళ్లకు మించి చేసి ఉంటే అక్కడికి బదిలీ కావడానికి వీలులేదు. ఈ నిబంధనలు ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావాల్సి ఉంది. కానీ.. దీని ప్రకారం కంపెనీలో బదిలీలు చేస్తే ఇబ్బందులు వస్తాయని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. అనారోగ్యంతోనో, కుటుంబ ఇబ్బందులతోనో ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు పెట్టుకోవడం జరుగుతుంది. కంపెనీ వెసులుబాటును బట్టి వారి బదిలీలను ఆమోదం చేయడం ఇప్పటివరకు జరిగింది. నేడు ఈ నిర్దిష్ట నిబంధనలు బొగ్గు పరిశ్రమలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కావని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

తొమ్మిదినెలల నుంచి పెండింగ్

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం కోసం డిసెంబర్ 2024 నుంచి మే 2025 వరకు కంపెనీ బదిలీల ప్రక్రియ నిలిపివేసింది. తరువాత అదే నెలలో ఈ కొత్త ఉత్తర్వులు తీసుకువచ్చారు. దీంతో ఇప్పటివరకు సుమారు తొమ్మిది నెలలుగా ఎలాంటి బదిలీలు జరగలేదు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు, దరఖాస్తు కోసం వేచి ఉన్న వారు కంపెనీ కొత్త నిబంధనలు చూసి తలలు పట్టుకుంటున్నారు.

నిబంధనలు మార్చాలి



కొత్త నిబంధనలు మార్చాలి. ఈ నిబంధనలతో ఉద్యోగులు ఇబ్బంది పడే ప్రమాదముంది. ఉద్యోగులు అనారోగ్య, కుటుంబ కారణాలతో రిక్వెస్ట్ బదిలీలు కోరుతారు. ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే సింగరేణిలో పని పరిస్థితులు వేరుగా ఉంటాయి. కంపెనీ కొత్తగా తీసుకువచ్చిన బదిలీ విధానాల ఉత్తర్వులు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ విధానాలకు సమాంతరంగా ఉన్నాయి. ఈ విధానాలను ఎత్తివేసి పాత పద్ధతినే కొనసాగించాలి. పైరవీలు లేకుండా చూడాలి.

– కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

'నా భర్తను ఇండియాకు రప్పించరూ..'


రితీశ్ (ఫైల్)

భైంసాటౌన్: తన భర్త దుబాయిలో పనిలేకుండా ఆకలితో అలమటిస్తూ, దుర్భర జీవితం గడుపుతున్నాడని, ప్రభుత్వం స్పందించి అతడిని ఇండియాకు రప్పించాలని భైంసా పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన అన్నపూర్ణ వేడుకుంటోంది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన సిలివేరు రితీశ్ మూడేళ్ల కిందట అబుదాబికి వెళ్లాడు. రెండేళ్ల అగ్రిమెంట్ పూర్తి కావడంతో అక్కడి నుంచి దుబాయికి వెళ్లాడు. కా గా, పాస్‌పోర్ట్, సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో కొన్ని నెలలుగా అక్కడే ఖాళీగా తిరుగుతున్నాడు. తిండి లేక, ఉండేందుకు చోటు లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో అతడు రోదిస్తూ ఇండియాకు పంపాలని వేడుకుంటున్న వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయం అతడి కుటుంబీకులకు తెలియడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తన భర్తను ఇండియాకు రప్పించాలని అతని భార్య అన్నపూర్ణ ఇటీవల ఎన్‌ఆర్‌ఐ అడ్వైజరీ కమిటీ సభ్యులను కలిసి విన్నవించింది. దీంతో వారు అక్కడి గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి సమాచారం ఇవ్వడంతో వారు అతడిని కలిసి మాట్లాడారు. ఆందోళన చెందవద్దని ధైర్యం చె ప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి తన భర్తను ఎలాగైనా ఇండియాకి రప్పించాలని అన్నపూర్ణ వేడుకుంటోంది. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ఆదుకోవాలని కోరుతోంది. కాగా, రితీశ్, అన్నపూర్ణ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు.

ఊడిన బస్సు టైర్లు.. తప్పిన ప్రమాదం

- 12గంటలు ట్రాఫిక్ అంతరాయం


రోడ్డుపై నిలిచిన వాహనాలు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ నుంచి హైదరాబాద్‌కు సోమవారం రాత్రి 10.30గంటలకు 10 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు టైర్లు మండలంలోని బీర్సాయిపేట్ సమీపంలోకి రాగానే ఊడిపోయాయి. దీంతో బస్సు రోడ్డు మధ్యలోనే ఉండిపోవడంతో రోడ్డుకు ఇరువైపులా 12గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. చిన్న వాహనాలు వెళ్లినప్పటికీ పెద్ద వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. రోడ్డుపై గుంతల కారణంగా బస్సు టైర్లు ఊడిపోయాయో.. లేదా బస్సు పర్యవేక్షణ లోపమో తెలియదు గాని పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 11గంటల వరకు ఇరువైపులా కిలోమీటర్ల మేర పెద్ద వాహనాలు నిలిచిపోయాయి. మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఉట్నూర్ మీదుగా ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు, ఇటుగా ఉట్నూర్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మంగళవారం పోలీసుల చొరవతో క్రేన్ సహాయంతో ఆ బస్సును పక్కకు జరపడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

చిన్నారిపై లైంగికదాడి కేసులో ఒకరికి 20ఏళ్ల జైలు


నిర్మల్ రూరల్: ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డ కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం జిల్లా జడ్జి శ్రీవాణి తీర్పు చెప్పారు. ఎస్పీ జానకీ షర్మిల తెలిపిన వివరాల ప్రకారం.. 2020లో కడెం మండలం నచ్చనిల్లాపూర్ గ్రామానికి చెందిన జాడి నారాయణ అనే వృద్ధుడు అదే గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సందర్భంగా సంబంధిత సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన తర్వాత మంగళవారం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టు–పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో జిల్లా న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. నేరం చేసిన వారెవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ పేర్కొన్నారు. కాగా, నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పీపీ వినోద్‌రావు, విచారణ అధికారులు అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఎస్సై ప్రేమ్‌దీప్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

దేశీదారు పట్టివేత


పట్టుకున్న దేశీదారు, నిందితులతో పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి మంగళవారం అక్రమంగా నిషేధిత దేశీదారు తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు మహారాష్ట్ర నుంచి కారులో తరలిస్తున్న దేశీదారును కాగజ్‌నగర్ పట్టణంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసిన 1,050.90 ఎంఎల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.63వేలు ఉంటుందని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ పట్టణానికి చెందిన విశాల్, వినేశ్ మిత్రా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తికి దేశీదారు సరఫరా చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో అక్రమ కార్యకలాపాలు, మద్యం రవాణా, విక్రయ కేంద్రాలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, సిబ్బంది రమేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

'అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలి'


సమావేశంలో మాట్లాడుతున్న శోభన్

చెన్నూర్: దసలి పట్టుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులపై అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ కోరారు. స్థానిక తాపీమేస్త్రి సంఘ భవనంలో మంగళవారం ఆయన పట్టు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఆదివాసీ రైతులు దసలి పట్టు కాయలు పండిస్తున్నారని తెలిపారు. మూడు తరాలుగా అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులను అటవీ అధికారులు పట్టుకువచ్చి హింసించడం దారుణమని పేర్కొన్నారు. రోజురోజుకు వేధింపులు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని పట్టు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చందు, నాయకులు రవి, బాపు, శంకరయ్య, తిరుపతి, రాజన్న, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

తలమడుగు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మెరుగు పీతంబర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెరుగు పీతంబర్ ఓ బాలికపై పలుసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ సమయంలో వీడియో చిత్రీకరించాడు. ఎవరికైనా చెప్తే వీడియోలు బయట పెడతానని భయపెట్టాడు. అయినా బాలిక విషయం కుటుంబ సభ్యులకు తెలుపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పీతంబర్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

జైనూర్: మండలంలోని పట్నాపూర్ శివారులో పేకాడుతున్న 11మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని పట్నాపూర్ శివారులో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న 11 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.11వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం టీజీ గేమింగ్ ఆక్ట్ కింద వారిపై కేసు నమోదు చేశారు.

మాటేగాంలో 9మంది..

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామ సమీపంలో మంగళవారం పేకాడుతున్న తొమ్మిది మందిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. వారి నుంచి రూ.51,700 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఊరంతటికీ ఒకే గణపతి

- ఐక్యతకు నిదర్శనం రాంపూర్


వినాయకుడికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

సాత్నాల: భోరజ్ మండలం రాంపూర్ గ్రామానికో ప్రత్యేకత ఉంది. గ్రామంలో 620 మంది జనాభా ఉంది. ప్రతీ సంవత్సరం వినాయక చవితి సందర్భంగా గ్రామస్తులంతా విరాళాలు సేకరించి ఒకే చోట పెద్ద గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సామూహిక పూజలు నిర్వహిస్తారు. 120 కిలోల వెండి ఆభరణాలతో గణపతిని అలంకరిస్తారు. ఏడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భజన, సామూహిక కుంకుమార్చన, పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తుండగా అధికసంఖ్యలో పాల్గొంటారు. గ్రామస్తులంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజల్లో పాల్గొంటూ వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఘనంగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సంప్రదాయం దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతోంది. ఏడు రోజులపాటు వినాయక మండపం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఎస్టీపీపీ గిరిజన ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక


ఎస్టీపీపీ ఈడీ చిరంజీవితో కమిటీ సభ్యులు


జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో సింగరేణి గిరిజన ఉద్యోగులు నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు గిరిజన ఉద్యోగుల సంఘం సెంట్రల్ కమిటీ ప్రెసిడెంట్ డి.పంతులా ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్టీపీపీ ఏరియా బ్రాంచ్ ఎస్టీ లైజన్ ఆఫీసర్‌గా డీ దేవేందర్‌సింగ్, గౌరవాధ్యక్షుడిగా కిరణ్‌బాబు, అధ్యక్షుడిగా బానోత్ తిరుమల్, ప్రధాన కార్యదర్శిగా అజ్మీర మోహన్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఎస్టీపీపీ ఈడీ చిరంజీవిని కలిశారు. ఎస్టీపీపీ ప్రధాన గేటు ఎదుట అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ.. వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ లైజన్ ఆఫీసర్ వెంకటయ్య, చీఫ్ అడ్వైజర్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ పులి సురేశ్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణ' మూడు గేట్లు ఎత్తివేత


మూడు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి వరద పోటెత్తింది. 10,200 ఇన్‌ఫ్లో వస్తుండగా అప్రమత్తమైన అధికారులు మూడు గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు కాగా, 1182.2 అడుగుల వద్ద స్థిరంగా ఉంచారు. – సారంగాపూర్

'కడెం'కు కొనసాగుతున్న వరద


కడెం ప్రాజెక్ట్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం ప్రాజెక్ట్‌కు మంగళవారం తెల్లవారుజామున 1,01,385 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఇరిగేషన్ అధికారులు తొమ్మిది వరద గేట్లు ఎత్తి 99,852 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రాత్రి వరకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ఒక గేటు ద్వారా 10,472 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.400 అడుగుల నీటిమట్టం ఉంది. – కడెం

'మత్తడివాగు' రెండు గేట్లు ఎత్తివేత


తాంసి: మత్తడివాగు ప్రాజెక్ట్ నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

తాంసి: వరుసగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే మండలంలోని వడ్డాడి సమీపంలోగల మత్తడివాగు ప్రాజెక్ట్‌లోకి వరదనీరు చేరి నిండుకుండలా మారింది. వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు కురిసిన వర్షానికి ప్రాజెక్ట్‌లోకి వరదనీరు రావడంతో రాత్రి నుంచి ఉదయం వరకు రెండు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. 1,440 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా రెండు గేట్లు ఎత్తి 2,005 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్ట్ ఏఈ హరీశ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా, 276.80 మీటర్లు నిల్వ ఉండేలా నీటిని దిగువకు వదులుతున్నట్లు పేర్కొన్నారు.

'సాత్నాల' నుంచి నీటి విడుదల


సాత్నాల: గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

సాత్నాల: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాత్నాల ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరుతోంది. మంగళవారం 1,560 క్యూసెక్కులు రాగా, 1,560 క్యూసెక్కులను ఒక గేటు ద్వారా వదిలిపెట్టినట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.046 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

వాగు ఉప్పొంగి ఆదివాసీల అవస్థలు


ఒకరినొకరు పట్టుకుని వాగు దాటుతున్న మామిడిగూడ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: భారీ వర్షాలకు వాగులో నీటి ప్రవాహం పెరిగి మండలంలోని మామిడిగూడ(జీ), మామిడిగూడ (బీ) గ్రామాల ఆదివాసీలు ఇబ్బంది పడ్డారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన వారసంతకు ఆయా గ్రామాల వారు వచ్చారు. సరుకులు తీసుకుని తిరిగి వెళ్తుండగా సాయంత్రం భారీ వర్షం కురిసి ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న వాగులో వరద ఉధృతి ఎక్కువైంది. దీంతో వారు వాగు ఇవతలి ఆంజీ గ్రామపంచాయతీ పరిధిలోని అంధ్‌మామిడిగూడ గ్రామంలోనే ఉండిపోయారు. తిండి లేక ఇబ్బంది పడ్డారు. చలిమంట వేసుకుని తెల్లవార్లు గడిపారు. మంగళవారం ఉదయం వాగులో కొంత ప్రవాహం తగ్గడంతో ఒకరినొకరు పట్టుకుని వాగు దాటి ఆయా గ్రామాలకు వెళ్లారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3.5కోట్లు మంజూరు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పనులు ప్రారంభించలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి వర్షాలు తగ్గిన వెంటనే వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

పొంగి పొర్లిన తర్ణం వాగు

- నిలిచిపోయిన రాకపోకలు


ఉధృతంగా ప్రవహిస్తున్న తర్ణం వాగు

సాత్నాల: భోరజ్ మండల పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలికంగా నిర్మించిన లోలెవెల్ వంతెన పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో జాతీయ రహదారి 353 బీపై సోమవారం అర్ధరాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పనుల కోసం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు గంటల తరబడి వాహనంలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డుపై కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. త్వరగా వంతెన నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సోన్: మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్ గ్రామంలోని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ ఎడమవైపు వరద ప్రభావిత ప్రాంతంలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గోపి మంగళవారం తెలిపారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఎడమ చేతిలో కొండ రాజ్ (35) అని హిందీలో రాసి ఉందని, కుడి చేతిలో హనుమంతుడి పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి సమాచారం తెలిసినవారు 8712659520, 8712659519 నంబర్లకు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు. కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.